# ఆకాశగంగ

రహదారికి రెండుకిలోమీటర్ల దూరంలో తీర్చిదిద్దిన నలభై ఎకరాల ప్రాంగణం. ఎటు చూసినా హరిత శోభలే. పచ్చటి తివాసీలు అందంగా పరిచినట్లుంది. అక్కడ కనిపించే తెల్లటి భవనాలు శ్వేతమత్తేభాలు వాహ్యాళి కొచ్చి ప్రకృతి సౌందర్యాన్ని చూసి ఆశ్చర్యంతో నిలిచిపోయినట్లున్నాయి. వాటి మధ్య ఒక పెద్ద భవనం ఐరావతంలా ఠీవిగా శిరసెత్తి గగనం వైపు చూస్తోంది. చక్కటి బాటలు భవనాల్ని కలుపుతున్నాయి. వాటి పక్కనున్న చెట్లు గాలికి కొమ్మలూపుతూ అక్కడికి వచ్చేవారికి స్వాగతం చెబుతున్నట్లున్నాయి. సంవత్సరం క్రితమే ఏర్పాటయిన ఇంజనీరింగు కాలేజి. ఆదర్శమైన పద్ధతులక్కడ ప్రాణం పోసుకుంటున్నాయి. విద్యా ప్రమాణాలు, క్రమశిక్షణ సూత్రాలు సమగతిలో పురోగమిస్తున్నాయి. విద్యార్థులందరూ ప్రాంగణంలోనే ఉండాలి. అక్కడ అన్ని వసతులు వున్నాయి.

పెద్ద హాస్టలుంది. గదులు శుభ్రంగా వుంటాయి. ఒక్కొక్క గదిలో ఇద్దరు విద్యార్థులుంటారు. ఈ సంవత్సరం ప్రతి గదిలోనూ రెండో సంవత్సరంలోకి వచ్చిన విద్యార్థి ఒకరు, కొత్తగా కోర్సులో చేరే విద్యార్థి ఒకరు వుండే ఏర్పాటు చేశారు. రెండో సంవత్సరం విద్యార్థిని 'సీనియర్' అంటారు. సీనియర్‌ని కొత్త విద్యార్థి 'అన్నా' అని పిలవడం, అలాగే కొత్తగా చేరిన విద్యార్థిని సీనియర్ 'తమ్ముడూ' అని పిలవడం అక్కడ తప్పక పాటించవలసిన నిబంధన. ఆడపిల్లలయితే అక్కాచెల్లెళ్ళ బాంధవ్యం నెలకొంటుంది. 'ఫ్రెషర్స్' పదం వాడరు.

ఒక్కగానొక్క కొడుకు రమేష్‌ను కారులో తీసుకొస్తున్న శ్యామ్రావు దంపతులకీ సంగతులన్నీ తెలుసు. వారిద్దరిలో సంతోషం, దిగులు పెనవేసుకున్నాయి. ప్రాంగణం దగ్గరవుతున్న కొద్దీ దిగులు గుండెల నిండా పెనుచీకటిగా ఆవరిస్తోంది.

కొడుకు అదృష్టవంతుడు కావడం చేతనే ఆ కాలేజీలో సీటు ఖాయం చేస్తూ ఉత్తరం వచ్చిన మాట వారికి గుర్తులేక కాదు. కాని పుట్టినప్పటినుంచి ఇప్పటివరకూ ఒక్క రోజు కూడా విడిచి వుండని గారాల బిడ్డను అంత పెద్ద ప్రాంగణంలో విడిచి పెట్టాలనే సత్యం వాళ్ళ మనసుల్ని కలవరపరుస్తోంది. కకావికాలు చేస్తోంది. అందమైన ప్రాంగణం వాళ్ళకి దండకారణ్యంలా తోచింది.

కారు లోపలిబాటలవెంట ముందుకు సాగుతోంది. చెట్లు జడలు విరబోసుకున్న రాక్షసుల్లా కనిపించాయి ఆ దంపతులకు.

కారు హాస్టల్ భవనం పోర్టికోలో ఆగింది. శ్యామ(్రావు దంపతులు రమేష్‌ను తీసుకుని చీఫ్ వార్డెన్ గదికి వెళ్ళారు. ఆయన కుర్చీలోంచి లేచి సాదరంగా ఆహ్వానించాడు. రమేష్‌ను పలకరించి దగ్గరకు తీసుకున్న తీరు ఆ దంపతుల్ని విస్మయపరిచింది. వారు అబ్బురపడ్డారు. ఆయనలో ఆత్మీయత మూర్తీభవించినట్లు వారు భావించారు.

చాలామంది కొత్త విద్యార్థుల్లో కనిపించే జంకు రమేష్‌లో కనిపించకపోవడం గమనించి చీఫ్ వార్డెన్ 'నైస్‌బాయ్' అని అభినందనపూర్వకంగా వెన్ను తట్టాడు.

శ్యామ(్రావు ఫారాలు నింపి సంతకం చేసే పని పూర్తి అయింది.

'రమేష్‌ది రూం నెంబరు 108. మొదటి అంతస్తు. రూంలో వుండే సీనియర్ ప్రతాప్ వెరీగుడ్ బాయ్. హి ఈజ్ ఎ జెమ్. లెటజ్‌గో' అని చీఫ్ వార్డెన్ తన సీట్లోంచి లేచి బయలుదేరాడు.

శ్యామ(్రావు దంపతులు, రమేష్ అతనివెంట నడిచారు.

ప్రతాప్ వారందరినీ వినయంగా ఆహ్వానించాడు. ఎంతో పరిచయం వున్నట్లు రమేష్‌ను 'తమ్ముడూ' అని పలకరించి అతని షెల్ఫ్, బెడ్, టేబిల్, ఛైర్ వగైరాలన్నీ చూపించాడు.

ఆ క్షణంలో ప్రతాప్ ఆ దంపతులకు పెద్దకొడుకులా తోచాడు. 'ప్రతాప్! నీ తమ్ముడు రమేష్ ఇంతవరకు ఎప్పుడూ మమ్మల్ని వదలి వుండలేదు. ఇకనుంచీ వీడి బాధ్యత నీదీ, ఈ వార్డెన్ సార్‌దే' అని రమేష్ తల్లి గాద్గదికంతో చెప్పింది.

'మేడం! నథింగ్ టు వర్రీ. రమేష్ ఇక్కడ హాయిగా వుంటాడు. చక్కగా చదువుకుంటాడు. వాడ్డూయూ సే ప్రతాప్?' అని చీఫ్ వార్డెన్ హామీ ఇచ్చాడు.

'యస్సార్!' వార్డెన్‌కు జవాబిచ్చి ప్రతాప్, రమేష్ తల్లితో 'అమ్మా! తమ్ముడు నాతో వుంటాడు. ఎటువంటి ఇబ్బంది వుండదు. ఈ కాలేజీ అంతా ఒకే కుటుంబం. నాన్నా మీరూ నిశ్చింతతో వుండండి' అని చెప్పాడు.

అతనిలో చోటుచేసుకున్న పెద్దరికం శ్యామ(్రావు దంపతులకు వింతగా తోచింది.

విచిత్రంగా రమేష్ కూడా అదే ధోరణిలో 'ఎందుకమ్మా మీ కంత బెంగ.... వార్డెన్ సార్, అన్న ప్రతాప్, ఇంకా ఎందరో అన్నలు వున్నారుగా. నాతోపాటు ఎంతోమంది తమ్ముళ్ళు వచ్చి చేరుతున్నారు. అంతా కలిసి మెలిసి వుంటాం' అంటుంటే ఆ దంపతులు తమను తాము నమ్మలేకపోయారు. అతని మాటలు వారికి ఊరట కలిగించాయి.

విద్యార్థిని దిగబెట్టేందుకు వచ్చిన తల్లిదండ్రులలో, బంధువులలో ఒక గంట తర్వాత వెళ్ళిపోవాలనే నియమం వుంది.

రమేష్‌ను ప్రతాప్‌కు అప్పగిస్తునప్పుడు తల్లి కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి. తండ్రి కళ్ళు చెమర్చాయి.

‘అమ్మా, నాన్నా! మీరు సంతోషంగా వెళ్ళిరండి. నా కిక్కడ ఎలాంటి ఇబ్బంది ఉండదు. బాగా చదువుకుంటాను’ అని రమేష్ మరోసారి వారికి నచ్చచెప్పాడు.

అక్కడ కొన్ని క్షణాలపాటు నిశ్శబ్దం రాజ్యమేలింది.

‘నేనున్నానమ్మా! అన్నీ చూసుకుంటాను.’ ప్రతాప్ హామీ ఇచ్చాడు.

రమేష్‌ను అక్కున చేర్చుకుని తల నిమిరి శ్యామల్రావు దంపతులు కార్లో కూర్చున్నారు.

కారు నెమ్మదిగా ముందుకు కదిలింది. ఆ దంపతుల చూపులు వెనకవైపే కేంద్రీకృతమయ్యాయి. ప్రాంగణం దాటేవరకు అవి అలాగే వున్నాయి.

చీఫ్ వార్డెన్ ప్రతాప్‌కూ, రమేష్‌కూ సూచనలిచ్చి తన కార్యాలయానికి వెళ్ళిపోయాడు.

ప్రతాప్, రమేష్ గదిలోకి వెళ్ళారు. ప్రతాప్ చుట్టూ చేతులు వేసి రమేష్ వెక్కి వెక్కి ఏడ్చాడు. ప్రతాప్ రమేష్‌ను పొదివిపట్టుకున్నాడు. అతని కంఠం ఆ రోదనతో శ్రుతి కలిపింది. ప్రతాప్ కళ్ళనుంచి జారిన కన్నీటిధార రమేష్ చెక్కిళ్ళపై పడుతోంది. రమేష్ కన్నీటితో కలిసి ఆకాశగంగలా నేలపైకి జారుతోంది. కొంతసేపటికి గుండెల్లోని వేదన తగ్గింది. ఇద్దరూ తమాయించుకున్నారు.

రమేష్‌కు ఒక సందేహం కలిగింది.

‘అమ్మా నాన్నా వెళ్ళిపోయారు. అందుకు బాధతో ఏడ్చాను అన్నా! మరి నువ్వెందుకు ఏడ్చావ్?’ అనడిగాడు.

‘అదా తమ్ముడూ! సరిగ్గా సంవత్సరం క్రితం నాకూ ఇలాగే జరిగిందిగదా, ఆ సంగతి ఎప్పుడూ నా మనస్సులో వుంటుంది. అందుకే ఈ ఆకాశగంగ నేలమీదకు జారింది. అమ్మానాన్నల ఆనందం కోసం మనం బాగా చదువుకోవాలి. క్రమశిక్షణ పెంచుకోవాలి’ అని చెప్పాడు, ప్రతాప్.

కాలేజి గంట గణగణ మోగింది.

తరగతులకు వెళ్లేందుకు అన్నదమ్ములు సిద్ధమవడంలో నిమగ్నమయ్యారు.

*(‘ఆంధ్రప్రదేశ్’ - నవంబరు, 1999)*